



ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని పట్టణంలోని గణపతి ఆలయాలలో భక్తుల తాకిడి కనిపించింది. పట్టణంలోని రిమ్స్ ఆవరణలోని మహా గణపతి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. చతుర్థి సందర్భంగా ఉపవాస దీక్షలు ఆచరించిన భక్తజనం.. విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజాది క్రతువుల్లో భాగస్వాములయ్యారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు, హారతులు అందచేసి గణపతిని ఆరాధించారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఆలయాన్ని దర్శించుకోవడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సంకటహర చతుర్థి ప్రాశస్త్యాన్ని భక్తులకు పండితులు వివరించారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

'యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి'

బోథ్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ప్రభుత్వం బాసటగా నిలవాలని మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, ఆర్ఐ సునీతలకు వినతిపత్రం అందించారు. యూనివర్సిటీ లేకపోవడం వల్ల ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక పోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను యూనివర్సిటీ కోసం చేపడతామన్నారు.



'సహకార' పదవులపై.. ఉత్కంఠ

- రేపటితో ముగియనున్న పీఏసీఎస్ పాలక వర్గాల పదవీ కాలం
- మరో ఆరు నెలల పాటు పొడగించాలంటూ నేతల పట్టు
- సొసైటీ చైర్మన్‌ల సభ్యత్వం రద్దుతో డీసీసీబీ పాలక వర్గంపై ప్రభావం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో కొనసాగింపునకే ఎక్కువ అవకాశాలు
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఆసక్తి

ఆదిలాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాల పదవీ కాలం ఈనెల 14తో ముగియనుంది. దీంతో సొసైటీ చైర్మన్, డైరెక్టర్‌ల పదవులపై ఉత్కంఠ కొనసాగుతోంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పీఏసీఎస్‌ల పదవీ కాలాన్ని ఇప్పటికే ఆరు నెలల పాటు పొడగించింది. ఈ గడువు కూడా గురువారంతో ముగిసిపోనుంది. దీంతో రెండవ సారి సొసైటీల పదవీ కాలం పొడగింపుపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తుంది. అయితే పొడగింపు ఉంటుందా? లేదా? అనే దానిపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతోంది. ఎన్నికలు నిర్వహించేంత వరకు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగిస్తారా? అనేది ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 77 సహకార సంఘాలు ఉన్నాయి. ఒక్కో సహకార సంఘం పరిధిలో 13 మంది డైరెక్టర్లు కొనసాగుతున్నారు. పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తేనే ఆగస్టు 15న డీసీసీబీ చైర్మన్ తో పాటు సొసైటీ చైర్మన్‌లు జెండాను ఆవిష్కరిస్తారు. లేదంటే అన్ని సొసైటీల్లో సీఈఓలే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

హైదరాబాద్ లోనే మకాం

గడువు సమయం దగ్గర పడుతున్న కొద్ది సహకార సంఘాల పాలకవర్గలలో టెన్షన్ వాతావరణం కనిపిస్తుంది. గత కొద్దిరోజులుగా డీసీసీబీ చైర్మన్‌తో పాటు పలువురు సొసైటీ చైర్మన్‌లు హైదరాబాదులోనే మకాం వేశారు. వ్యవసాయ శాఖ మంత్రితో పాటు పలువురు ప్రభుత్వ పెద్దలను కలుస్తూ.. మరోసారి అవకాశం కల్పించాలంటూ కోరుతున్నారు. చైర్మన్‌లు తమకున్న రాజకీయ పలుకుబడి, పరిచయాలతో



ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న చైర్మన్‌లు అంతా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నా రు. జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీ పలువురు సీనియర్ నేతలతో ప్రభుత్వంపై ఒత్తిడి చేయించే ప్రయత్నం చేస్తున్నారు. బుధవారం సాయంత్రంలోపు ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే అవకాశం ఉందుంటున్నారు.

డీసీసీబీపై ఎఫెక్ట్

సహకార సంఘాల చైర్మన్‌ల సభ్యత్వం రద్దయితే ఉమ్మడి జిల్లా డీసీసీబీపై కూడా ప్రభావం పడనుంది. వాస్తవానికి డీసీసీబీ పదవీ కాలం ఆగస్టు 24 వరకు ఉంది. కానీ సొసైటీ చైర్మన్‌లే డీసీసీబీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లుగా కొనసాగుతున్నారు. సొసైటీల సభ్యత్వం రద్దు అయితే డీసీసీబీ పాలకవర్గం కూడా రద్దయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుత డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజా రెడ్డి తాంసి సొసైటీ నుంచి చైర్మన్‌గా ఎన్నికై డీసీసీబీ చైర్మన్ పదవిలో కొనసాగుతున్నారు. డైరెక్టర్‌లు కూడా ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు సొసైటీల చైర్మన్‌లుగా ఎన్నికైన తర్వాతనే డీసీసీబీలో డైరెక్టర్‌లుగా

(తరువాయి 6వ పేజీలో....)



ఇచ్చోడ మండల పీఏసీఎస్ కార్యాలయం



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను మంగళవారం ఎంపీ గోడం నగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి నుంచి ప్రతిపాదించిన చెరువులను పీఎంకేఎస్‌వై పథకంలో చేర్చి పరిపాలన అనుమతులను త్వరలో ఇవ్వాలని విన్నవించారు. త్వరలోనే అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

భారీ వర్ష సూచన

- ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

తలమడుగు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తలమడుగు తహసీల్దార్ రాజమోహన్ కోరారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల వద్ద గల లో లెవెల్ వందల వద్ద ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అంతేకాకుండా చేపల వేటకు వెళ్లే జ్యువలరీలో మూడు రోజులపాటు వెళ్ళవద్దని కోరారు. అంతేకాకుండా శిధిలావస్థలో ఉన్న పురాతనమైన ఇళ్లలో ఎవరూ ఉండవద్దని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే రెవెన్యూ సిబ్బందిని, ఇతర శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.



తాంసిలో పొలాల పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

తాంసిలోనే పొలాల పండుగ

- కలెక్టర్ రాజర్షి షా
- అధికారికంగా నిర్వహణకు ఏర్పాట్ల పరిశీలన
- రాష్ట్ర నలుమూలల నుంచి ప్రముఖుల రాక!!

తాంసి రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారికంగా ఈనెల 23న నిర్వహించనున్న పొలాల పండుగ ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులు, గ్రామస్థులతో కలిసి మంగళవారం పరిశీలించారు. జిల్లా యంత్రాంగం టూరిజం శాఖ, డీఆర్డీవో, డీపీవో, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖల సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర స్థాయి ఎన్‌జీవో (ఆధ్యకళా) అధ్యక్షుడు జయధీర్ తిరుమలరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చి పలు సలహాలు ఇవ్వడం జరిగిందని, పండుగకు సంబంధించి ఏర్పాటు చేసిన డాక్యుమెంటరీ చిత్రాన్ని కలెక్టర్, ప్రొఫెసర్ తిరుమలరావుతో కలిసి తిలకించారు. స్థానిక అధికారులు, గ్రామస్థులతో ఏర్పాట్ల ప్రగతిపై సమీక్షించారు. పండుగ సందర్భంగా పర్యాటకులకు అందించబోయే సాంస్కృతిక కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్య పరిస్థితులు మొదలైన అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పొలాల పండుగ సంస్కృతి సంప్రదాయాలతో ఈ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారని, పొలాల పండుగ మన సంస్కృతిని, వ్యవసాయాన్ని ప్రతిబింబించే ప్రత్యేక కార్యక్రమం అని అన్నారు. ఈ వేడుక రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందేలా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు, హస్తకళల ప్రదర్శనలు, తినుబండారాల స్టాళ్ళు, జానపద నృత్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవలే మత్తడివాగులో పూడిక తీసిన తరువాత నీరు పుష్కలంగా వస్తున్నాయని, ఈ స్థలాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. పొలాల పండుగ నిర్వహణ కోసం తాంసి గ్రామస్థులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం తరపు నుంచి కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టీమ్ ప్రొఫెసర్ తిరుమల రావు, సంబంధిత జిల్లా అధికారులు, టూరిజం అధికారి రవి, డీఆర్‌డీవో రవీందర్, డీపీవో రమేష్, సీపీవో ప్రత్యేక అధికారి, ఎంఆర్వో, ఎంపీడీవో, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.





పొన్నారిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఇన్‌సెట్‌లో వాగులో నుంచి నడిచి వెళ్తూ..)

ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

తాంసి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పొన్నారి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. నిర్మిస్తున్న ఇళ్ల వద్దకు వెళ్లి ఎలా నిర్మిస్తున్నారో పరిశీలించారు. ఇప్పటి వరకు బిల్లులు ఏ మేరకు చెల్లించారో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ఏ మేరకు ఉందో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణాలలో అవకతవకలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత లోపం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటి వరకు ఏ మేరకు పూర్తయ్యాయో వెంటనే నివేదిక సమర్పించాలని సూచించారు.



బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలు

ఆదిలాబాద్ టౌన్: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఇందిర ప్రియదర్శిని మైదానంలో మంగళవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యువతకు హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో అక్టోబర్ 31 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగానే ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అవగాహన కార్యక్రమాల వివరాలను తెలుసుకుని పోస్టర్లను ఆవిష్కరించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

క్రీడాకారులు సత్తా చాటాలి

- ఆదిలాబాద్‌లో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు
- సంఘం జిల్లా అధ్యక్షుడు కలాల శ్రీనివాస్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బేస్ బాల్ సంఘం అధ్యక్షుడు కలాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జిల్లా స్థాయి బేస్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహించగా.. అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలాల శ్రీనివాస్ మాట్లాడుర ఎంపికైన క్రీడాకారులకు బుధవారం నుంచి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16, 17, 18వ తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జరగనున్నాయని, దాదాపు 600 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. వారి కోసం అవసరమైన పూర్తి సౌకర్యాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, అజయ్, గౌతమ్, నాగరాణి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉట్నూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోనల్ పరిధిలో భారీవాహనల రాకపోకలకు ప్రభుత్వం అనుమతిచడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణ రావ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్, ఆర్టీఏ మెంబర్ దూట రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ జైవంత్ రావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఇక్కడ సరైన రవాణా సదుపాయం లేకుండా చేసి అభివృద్ధి జరగకుండా భారీ వాహనాలను రాకపోకలకు నిలిపివేశాయని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అయిన తర్వాత భరివాహనల వల్ల టాన్స్‌పోర్ట్ వ్యవస్థ చిన్నాభిన్నం కావడం గురించి అసెంబ్లీ లో ఇక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి వివరిస్తూ, ఎమ్మెల్యే చేసిన కృషి ఫలితంగా కవ్వాల్ టైగర్ జోనల్ పరిదిలోభారీ వాహనాల రాకపోకలకు ప్రభుత్వాన్ని ఒప్పించి అనుమతి తీసుకురావడం తో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ కన్వీనర్ బిరుదుల లాజర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఆత్రం రాహుల్, దాసండ్ల ప్రభాకర్, కోడి ప్రభాకర్, ఆన్సర్, నిస్సార్, కొత్తపల్లి మహేందర్, రాజేష్ నాయక్, నందుం, మహిళా నాయకురాలు భాగ్య లక్ష్మీ, అన్నపూర్ణ, నీలాబాయ్, రాజగౌడ్, సిద్ధం రాజేశ్వర్, రవి, రాపెల్లి భాస్కర్, సీతారాం, డోల్కల యేసు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో పాలతో అభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : కలెక్టర్
- సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుపై సుదీర్ఘ చర్చ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, గృహ జ్యోతి, మహాలక్ష్మి, సౌర విద్యుత్ పథకాలతీరుపై కలెక్టర్ రాజర్షి షా సమీక్షగా సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులకు విస్తృత సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, మహిళా స్వయం సహాయక సంఘాలకు చెల్లింపులు, గృహ జ్యోతి, మహాలక్ష్మి, భూభారతి, ఇసుక, గ్రావెల్ సమస్యలు, సౌర విద్యుత్ వ్యవస్థలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. సంబంధిత శాఖలైన జడ్పీ సీఈవో, డీఆర్‌డీవో, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ, గ్యాస్ ఏజెన్సీలు, ఆర్‌డీవోలు, తహసీల్దార్లు హాజరు కాగా.. కలెక్టర్ సమస్యల పరిష్కార మార్గాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ విభాగాలకు చెందిన బహిరంగ స్థలాలపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, వీటి ద్వారా విద్యుత్ ఆదాతో పాటు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని అన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులపై అన్ని మండలాల రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిశీలత గురించి ఆరా తీసి కమిటీ సభ్యులు, ఆయా శాఖల సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, ఆర్‌డీఓ స్రవంతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న అధికారులు (ఇన్‌సెట్‌లో కలెక్టర్ రాజర్షి షా)



బోథ్‌లో యూరియా కోసం సొసైటీకి వచ్చిన రైతులు

'యూరియా కొరత లేదనడం సరికాదు'

బోథ్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొనడం సరికాదని, మండలంలో తీవ్రంగా ఉందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సోలకి సత్యనారాయణ, పట్టణ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్లు పేర్కొన్నారు నాయకులు మండలంలో యూరియా కొరత లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు మంగళవారం యూరియా కోసం వచ్చిన రైతులకు గోడౌన్‌లో యూరియా లేదని అక్కడ సిబ్బంది పేర్కొన్నారని వారు తెలిపారు. అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి యూరియా కోసం వచ్చేసరికి స్థానిక రైతులే యూరియాను తీసుకొని వెళ్లడం జరుగుతుందన్నారు గత మూడు రోజుల నుంచి గ్రామాల నుంచి వచ్చే రైతులు తిప్పలు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. కలెక్టర్ ఈ విషయమై జోక్యం చేసుకొని రైతులకు అవసరమైన యూరియా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా లైబ్రేరియన్ డే



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సాయి ప్రసాద్

ఉట్నూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని పురస్కరించుకొని గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీకళాశాలలో లైబ్రేరియన్స్ డే వేడుకలను నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సాయిప్రసాద్ ముందుగా ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసారు. కళాశాల గ్రంథపాలకుడు జి.చంద్రశేఖర్ గ్రంథాలయాల అభివృద్ధికి, గ్రంథ పాలకుల అభివృద్ధికి ఎంతో కృషి చేసినటువంటి ఎస్ఆర్ రంగనాథన్ (గ్రంథాలయ పితామహుడు) సేవలను కొనియాడారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సాయిప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్ రావు మాట్లాడుతూ టెక్నాలజీకి అనుగుణంగా గ్రంథాలయాల్లో కూడా మార్పులు వస్తున్నాయన్నారు.ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వెళ్లాలని పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, అంతేకాకుండా ఓఎన్ఓఎస్‌లో కూడా సాష్టన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత

తలమడుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుయాడి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం బిజెపి మండల అధ్యక్షుడు నక్క ధనంజయ్ 8 వేల రూపాయలు పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పేద విద్యార్థులకు ఉంటారని, వారికి మౌలిక వసతుల కోసం ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్ ఇతర సామగ్రి కొనుగోలు చేయాలని పాఠశాలకు ఆర్థిక సంబంధించిన ధనంజయుడు పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు. ఇందులో మాజీ సర్పంచ్ పోతారెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన దినసరి ప్రైవేట్ ఫైనాన్స్‌లు

బోథ్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండు నెలల క్రితం జిల్లా ఎస్పీ ప్రైవేట్ ఫైనాన్స్ వ్యవస్థను కట్టడి చేయడంతో పోలీసుల ఆదేశాల మేరకు ఫైనాన్సింగ్ వ్యవస్థను నిలిపివేశారు. అయితే గుట్టు చప్పుడు కాకుండా గత 15 రోజుల నుంచి రోజు వారి ఫైనాన్స్‌లు ప్రారంభమయ్యాయి.మండల కేంద్రంలో దాదాపు ఆరుగురు మంది ఈవ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక వ్యాపారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అత్యధిక వడ్డీలకు లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఎస్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్ లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ అయినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జీఎస్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఆనంద్ త్రిపాఠి ఈ నెల 6వ తేదీన తన సొంత ఊరైన మధ్యప్రదేశ్ కు వెళ్లారు. ఈ క్రమంలో ఆయనస్నేహితుడు లాలా శివకుమార్ మంగళవారం వారి ఇంటి ముందు నుంచి వెళుతుండగా వారి ఇంటి కిటికీలు తెరిచి ఉండడంతో.. అక్కడికి వెళ్లి చూడగా ఇంటితాళం పగలగొట్టి ఉంది. ఈ విషయాన్ని ఆనంద్ త్రిపాఠికి ఫోన్ ద్వారా తెలిపారు.ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం కట్ చేసి లాకర్‌లో గల నగదు రూ.10 వేల నగదు, రూ.5 వేల విలువైన రిస్ట్ వాచ్, 400 గ్రాముల వెండి వస్తువులను దొంగలించినట్లు గుర్తించారు. బాధితుడు ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):పట్టణంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.పక్కసమాచారం మేరకు సీసీఐ సమీపంలోని ఖాళీ స్థలంలో బంగారిగూడకు చెందిన మైనర్(17)బాలుడు, ఖానాపూర్‌కు చెందిన షేక్‌షా బాజ్(22)గంజాయి అమ్ముతుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. వారివద్ద నుంచి 70గ్రాముల ఎండు గంజాయి, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి మహారాష్ట్రా లోని భోకర్ కు చెందిన లాల అనే వ్యక్తి నుంచి కొనుక్కొని వచ్చినట్లు పేర్కొన్నారు.

మానసిక వేధింపులతోనే మహిళా మృతి

తలమడుగు , ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్త, అత్తమామల మానసిక వేధింపులతోనే తమ కూతురు మృతి చెందిందని మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన మొట్టే పూర్ణచందర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారని ఎస్సై రాధిక తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని గజ్జల గ్రామానికి చెందిన పూర్ణచంద్ అనే వ్యక్తి తన కూతురు మానసను మూడు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి గంపల ప్రశాంత్‌తో వివాహం జరిగిందన్నారు. వివాహం జరిగిన రెండు సంవత్సరాల తర్వాత గంపల ప్రశాంత్ ఆర్మీ ఉద్యోగం చేయడం వలన జమ్ము కాశ్మీర్‌కు మానసను తీసుకొని వెళ్లాడని తెలిపారు. అక్కడ మానస ఆరోగ్యం మొత్తంగా క్షీణించిపోయింది. అందువలన మానస తల్లిదండ్రులు మానసను తిరిగి కజ్జర్ల గ్రామానికి తీసుకొని వచ్చి అప్పటినుండి తనకు చికిత్స చేయిస్తూ ఉన్నప్పటికీ తగ్గకపోవడం చేత మంగళవారం మరణించిందని, మానస ఆరోగ్యం క్షీణించడానికి తన అత్తమామలు, భర్త మానసికంగా వేధిస్తున్నారు. అని మానస తండ్రి అయిన పూర్ణచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోవడం జరిగిందని ఎస్సై తెలిపారు.

సీపీఐ బలోపేతమే లక్ష్యం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటిలను నియమించడం జరుగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సన్మానించారు. మేడ్చల్ లో జరగనున్న రాష్ట్ర నాల్గవ మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు దేవేందర్, నలిని రెడ్డి, కుంటాల రాములు, ఆమీన పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో కీలకపాత్ర ఏఐఎస్ఎఫ్ దే

బోథ్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ పార్టీ విద్యారంగ సమస్యలపై పోరాటంతో పాటు దేశం కోసం పనిచేస్తుందని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు మున్షిఫ్ పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో జెండా ఎగురవేశారు. ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోని విద్యారంగ సమస్యలపై పోరాడిన మొట్టమొదటి సారిగా ఆవిర్భవించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఐఎస్ఎఫ్ మాజీ అధ్యక్షులు డి. గోవర్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

భైంసా రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిప్రి కాలనీలో గణేష్ పటేల్ అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ప్రతిరోజు లాగానే ఉదయం మేతకు వెళ్లి ఆవు తన వ్యవసాయ భూమిలో మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. దీని విలువ రూ. 60,000ల వరకు ఉంటుందని రైతు తెలిపారు. బాధిత రైతు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలని మాదిగల వినూత్న నిరసన

లక్ష్మణచాంద రూరల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మాల సంఘం నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని ఆపాలని మాదిగ సంఘం మండల కేంద్రంలోని చౌరస్తాలో మంగళవారం డప్పు వాయిద్యాలు, బాజాభజంత్రీలతో బైఠాయించి వినూత్న నిరసన చేపట్టింది. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన వలన స్థానికంగా ట్రాఫిక్ నిలిచిపోగా ఎస్సై జి. శ్రీనివాస్ వచ్చి సంబంధిత అధికారుల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నిరసనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి విందుకు వెళ్తున్న ఆదివాసీ టీచర్‌కు సన్మానం

ఉట్నూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ఆహ్వానం అందుకున్న ఆదివాసీ టీచర్ తొడసం కైలాష్, అవార్డు గ్రహీత కాత్లే మారుతిలను ఆదివాసీ బిరుదుగోండి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని రాంజీ గోండు భవనంలో మంగళవారం ఆదివాసీ బిరుదు గోండి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విశిష్ట సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గోండి భాషలో మహాభారత్ గ్రంథాన్ని రచించి, ఏఐ ద్వారా అనేక పాటలు సృష్టించిన తొడసం కైలాష్ స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) సందర్భంగా రాష్ట్రపతి విందుకు ఆహ్వానించబడిన సందర్భంగా రాష్ట్ర కమిటీ ఆత్మీయ సన్మానం



గిరిజన టీచర్‌ను సన్మానిస్తున్న ఆదివాసీ గిరిజనులు

చేసిందని రాష్ట్ర అధ్యక్షులు మరుసుకోలా తిరుపతి తెలిపారు. ఆదివాసీ బిరుదు తోటి జాతికి సంబంధించిన రాష్ట్ర సమస్యలను వివరిస్తూ, రాష్ట్రపతి కి వినతిపత్రాన్ని తొడసం కైలాష్ ద్వారా అందజేయాలని కోరారు. ఇది ఇలా ఉండగా ఆర్చరీ (విలువిద్య)లో నైపుణ్యం కలిగి, అనేక మందికి శిక్షణనిచ్చి, ఇటీవల పురస్కారం అందుకున్న ఆదిలాబాద్ మండలం చించు ఘాట్ గ్రామానికి చెందిన కాత్లే మారుతి ని కూడా రాష్ట్ర కమిటీ సన్మానించింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం శ్రీనివాస్,గౌరవాధ్యక్షులు పెందుర్ ఆనంద్, ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు పెంద్రం రాజేష్, మర్సుకోల అశోక్, కాత్లే శ్రీధర్, కాత్లే పృథ్వి, సోయం లలిత, మర్సుకోలా సరస్వతి, కుడిమెత సుధాకర్, మర్సుకోల గోపాల్, లవన్, రాములు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడటం సరికాదు

● బీజేపీ నాయకులు రావుల రాంనాథ్

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి టైంపాస్ రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీలో తన ఉనికి కాపాడుకోవడానికి మతి భ్రమించి మాట్లాడటం సరికాదని బీజేపీ నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. మంగళవారం సిద్దాపూర్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించి అనంతరం మాట్లాడుతూ... గతంలో గృహ శాఖ మంత్రిగా పని చేసిన మీరు ఒక లోతట్టు ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టి, గత ఏడాది వర్షాలకు ఒక అంతస్తు వరకు పూర్తిగా ఆ ఇళ్లు మునిగిపోవడం జరిగిందన్నారు. అప్పుడు అధికార పార్టీలో మీ అరాచకాలకు అడ్డూ అదుపు లేదు. నేడు కూడా అధికార కాంగ్రెస్ పార్టీలో ఉండి స్థానిక బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిపై మాజీ మంత్రి బురద జల్లే చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల్లోగా ఈ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేపట్టకపోతే 10 వేల మందితో బీజేపీ మహా ధర్నా చేపడతామని హెచ్చరిస్తున్నామని తెలిపారు. దమ్ముంటే ముఖ్యమంత్రి ఇంటి ఎదుట ధర్నా చేసి ఇళ్ల పంపిణీకి అనుమతి తీసుకురా, అధికార కాంగ్రెస్ పార్టీలో నీకు ఉనికి లేదని, నీ ఉనికి కాపాడుకోవడానికి రెండు మూడు నెలలకు ఒకసారి నిర్మల్‌లో తప్పుడు ప్రచారాలతో చేసే చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హయాంలో పక్కనే జీఎన్‌ఆ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు రావుల

ర్ కాలనీ అక్రమ లే అవుట్‌కి అనుమతులు ఇచ్చి అమాయక ప్రజల ఉసురు పోసుకున్నది ప్రజలు ఇంకా మరువలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు తక్కల రమణారెడ్డి, ముత్యం రెడ్డి, ఒడిసెల అర్జున్, తాజా మాజీ కౌన్సిలర్లు సాధం అరవింద్, నరేందర్, నవీన్, పద్మాకర్, పోడెల్లి గణేష్, నాయకులు గంజి రాజు, జుట్టు దినేష్, జింకసూరి, రవి, నిర్మల్ రూరల్ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నర్సారెడ్డి, గణేష్ గౌడ్, ఈర్ల విజయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ పనుల పూర్తి చేయాలి

నిర్మల్,ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రమైన నిర్మల్ శివారు ప్రాంతంలోని సిద్దాపూర్ వద్ద నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో మిగిలిన పనులు పూర్తి చేయాలని మంగళవారం మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో



మాట్లాడుతున్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

ధర్నా చేపట్టారు. నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులకు అడ్డుగా మారాడని ఆయన ఆరోపించారు. పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. వెంటనే నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు త్వరితగతిన పూర్తి చేసి మౌలిక సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు అందివ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఈ నెల 25 తేదీలోపు మౌలిక సదుపాయాలపై పనులు ప్రారంభించకుంటే కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. పేద ప్రజలకు అన్యాయం జరుగుతే ఊరుకునేది లేదన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

● డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని డీసీసీ అధ్యక్షుడు కూ చాడి శ్రీహరి రావు అన్నా రు. జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్మల్ నియోజకవర్గంలోని 124 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అజహర్, సాయిబాబా ఆలయ చైర్మన్ భూరాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయ్యన్నగారి పోశెట్టి, భాగ్యనగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మూడారపు రవి, అడపా శ్రీకాంత్, పూదరి అరవింద్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

వడ్‌గాం గ్రామ యువకుడికి డాక్టరేట్

తానూర్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్‌గాం గ్రామానికి చెందిన మద్నూరే రాహుల్‌కు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా లభించింది. కాగా రాహుల్‌కు మండల వాసుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు తిరంగా బైక్ ర్యాలీ



జాతీయ పతకాలతో ప్రదర్శనలు నిర్వహిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

భైంసారూరల్/కడెం/నిర్మల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం మున్సిపల్ కేంద్రమైన భైంసాలో నిర్వహించే తిరంగా బైక్ ర్యాలీ కార్యక్రమంలో నియోజక వర్గవాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో సంబంధిత విషయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీలకతీతంగా తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీల శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు కుల,వర్గ,మతాలకతీతంగా తిరంగా ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బైక్ ర్యాలీ ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ నుంచి ప్రారంభమై మున్సిపల్ కార్యాలయ రోడ్డుమ ఆర్గం మీదుగా గాంధీగంజ్, బస్టాండ్, శివాజీ చౌక్ వరకు కొనసాగుతుందని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు జాతీయ పతకాలతో ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో బీజేపీ హర్ ఘర్ తిరంగా ర్యాలీ జిల్లా మహిళా ఇన్‌ఛార్జీ సిరం సుష్మారెడ్డి, భైంసా పట్టణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల రాము, దగడే శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎనుపోతుల మల్లేశ్వర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తోట లింగురామ్, మాజీ కౌన్సిలర్ గౌతం పింగ్లే, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, ప్రతినిధులు సాంప్లీ రమేష్, దిలీప్, కాసర్ల ప్రవీణ్, సుభాష్, గాలి రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబానికి ప్రమాదబీమా పరిహారపు చెక్కు

కుబీర్ మండల కేంద్రానికి బోడ్డు యశోద ఇటీవల పాము కాటు బారిన మృతిచెందగా ఇందిర మహిళా శక్తి ప్రమాద భీమా పరిహారం కింద రూ.10లక్షలు మంజూరయ్యాయి.ఇందులో మాజీ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, ఐకేపీ ఏపీఎం రాథోడ్ ఉత్తమ్, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ స్వాతి,ఐకేపీ సీసీసరస్వతీ,కుబీర్‌మండల బీజేపీ అధ్యక్షుడు యేశాల దత్తాత్రి,సాంప్లీ రమేష్, నాగేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కడెం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు కడెం పురవీధుల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. జాతీయ సమైక్యతను చాటడం, దేశభక్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీసీ విభాగం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌సుధాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ యు. గంగాధర్, ఎన్‌సీసీ అధికారి ఉమేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కొనుగోలు చేసి పరారైన వ్యాపారిని పట్టుకున్న పోలీసులు

బోథ్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గత రెండు సంవత్సరాల క్రితం మండలంలోని కనుగుట్ట, బోథ్ గ్రామాలలో రైతుల నుండి పంట కొనుగోలు చేసి దాదాపు 14 లక్షల రూపాయల మేరకు ఇవ్వకుండా పరారీ అయిన వ్యాపారి మేకట్టి రతన్ కుమార్ మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ పంపించినట్లు బోథ్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీ సాయిలు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ రైతులు గత రెండు సంవత్సరాల క్రితం తమ వద్ద పంటను కొనుగోలు చేసి వ్యాపారి పరారయ్యారని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి విన్నవించడం జరిగింది. దీంతో అధికారుల ఆదేశం మేరకు స్థానిక పోలీసు అధికారులు ఎవరికి చిక్కకుండా హైదరాబాద్‌లో జీవిస్తున్న ఈయనను పట్టుకువచ్చి మంగళవారం రిమాండ్ చేయడం జరిగింది. అయితే రిమాండ్ కాకముందు వ్యాపారి రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను ఇస్తామని అధికారుల ముందు రైతులకు భరోసా ఇచ్చారు. ఏది ఏమైనా పరారీ అయినా వ్యాపారి రైతులకు డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

ముథోల్‌లోని జఠ శంకర్ ఆలయంలో చోరీ

ముథోల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని మిట్ట మధ్యాహ్నం మంగళవారం జఠ శంకర్ ఆలయంలో గుర్తు తెలియని దొంగ హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే ముథోల్ గ్రామ సమీపంలో గల జఠ శంకర్ ఆలయంలో మధ్యాహ్నం 12:30 సమయంలో గుర్తు తెలియని దొంగ ఆలయంలో ఉన్న హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లాడు. ఈ విషయాన్ని ఆలయానికి వచ్చిన భక్తులు గమనించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించడంతో ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తన సిబ్బందితో ఆలయానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అయితే ఈ సీసీ ఫుటేజ్‌లో దొంగ హుండీ తాళం పగులగొట్టి డబ్బులు ఎత్తికెళ్లినట్లు కనిపిస్తుంది. ఆలయ పరిసరాల్లో మరో ఇద్దరు గుర్తు తెలియని వారు ఆ సీసీ ఫుటేజ్‌లో కనిపించారు. దొంగలను తప్పకుండా పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. ముథోల్‌లోని ప్రధాన కూడలిలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు స్థానికులకు అవగాహన కల్పించి గ్రామంలో 20 సీసీ కెమెరాలను పెట్టించినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

'సహకార' పదవులపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి...)

కొనసాగుతున్నారు. అంటే సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోతే ఆ వెంటనే డీసీసీబీ పాలకవర్గం కూడా రద్దవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ధీమాతో సొసైటీ చైర్మన్‌లు

పదవీ కాలం పొడగింపుపై సొసైటీల చైర్మన్‌లు కొంత ధీమాతోనే కనిపిస్తున్నారు. ఎందుకంటే త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ యథావిధిగా పాలకవర్గాలను కొనసాగిస్తుందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచేందుకు సొసైటీ చైర్మన్‌లు డైరెక్టర్‌ల పాత్ర కీలకంగా కనిపిస్తుంది. అలాగే మరో వారం రోజుల్లోనే నామినేట్ పదవులన్నింటిని భర్తీ చేస్తామని తాజాగా ప్రభుత్వం ప్రకటించింది. ఇలాంటి పరిస్థితుల్లో కొనసాగింపునకే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతన్నాయి. స్థానిక ఎన్నికలకు ముందు గ్రామ స్థాయిలో ఎలాంటి విభేదాలు అసంతృప్తులకు అవకాశం లేకుండా ప్రభుత్వం జాగ్రత్త పడనుంది. గత కొద్ది రోజులుగా స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్‌గా ప్రభుత్వం ముందు కెళ్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో సహకార సంఘాల పదవీ కాలాన్ని పొడగించేందుకే ఎక్కువగా అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

తానూర్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఝరి(బి) గ్రామంలో మంగళవారం ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రమాదాల నుండి మనల్ని మనం ఎలా రక్షించుకోవాలో ఎదుటి వాళ్లను ఎలా రక్షించాలో ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం వలన ప్రజలు అప్రమత్తంగా ఉంటారని అన్నారు. కావున ప్రతి ఒక్కరు అవగాహన సదస్సులో చెప్పి మెళుకువలను పాటించాలన్నారు. అనంతరం ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి వినిత్‌కుమార్ మాట్లాడుతూ పలు అత్యవసర పరిస్థితుల్లో పాటించాల్సిన కొన్ని విషయాలను వివరించారు. ఉరుములు ఏ వచ్చినప్పుడు ఏ చెట్టు కింద పోకుండా కూర్చొని ఉండాలని సూచించారు. అలాగే వరదల నుండి బయటపడడం, భూకంపం నుండి అప్రమత్తం కావడం, తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ టీం సిబ్బంది వినీత్‌కుమార్, ఏపీవో శివలింగం, ఆర్ఐ నరేష్, గ్రామ కార్యదర్శి జాదవ్ విక్రమ్, టెక్నికల్ అసిస్టెంట్ రమణగౌడ్, తహసీల్దార్ సిబ్బంది శివ, గ్రామస్తులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

దిలావర్‌పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ అధికారి గోవర్ధన్ అన్నారు. మంగళవారం బన్సపల్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎంలు, ఐకేపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత

ముథోల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌కు చెందిన దివ్యాంగులు లక్ష్మణ్, జి. మల్లన్న, ఎస్. సంతోష్‌కు తనవంతు సామాజిక బాధ్యతగా వాకర్లు- హ్యాండ్ స్టిక్‌లను మంగళవారం రోజు స్థానికుడు గడ్డం సుభాష్ గ్రామ పెద్దల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తనవంతు బాధ్యతగా సామాజిక సేవలు భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వీడీసీ అధ్యక్షుడు జి. నారాయణ, గ్రామ పెద్దలు లక్ష్మన్న, సంజు పటేల్, తన్వీర్, పోశెట్టి, అశోక్, గంగాధర్, ఎస్. ప్రసాద్, ప్రవీణ్, నవీన్, ప్రసాద్, లక్ష్మణ్, శైలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కుంటాల, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): కుంటాలలో మంగళవారం ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈవో ముత్యం తెలిపారు. తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వీవోఏలకు, ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. డ్వాక్రా మహిళల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదవని మహిళలకు ఉపాధ్యాయులు శిక్షణ అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, అంతేగాకుండా మహిళలకు విద్యార్హత పెంచుకోవడానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటిలో అడ్మిన్ కావాల్సిందిగా అందుకు తగిన ప్రోత్సాహం ఇవ్వడానికే ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్ కుమార్, శ్రావణ్ కుమార్ ఉన్నారు.

ప్రతి మహిళను సంఘంలో చేర్చాలి:ఏపీఎం

ముథోల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి మహిళను మహిళా సంఘంలో చేరేలా ప్రోత్సహించాలని ఐకేపీ ఏపీఎం గురుచరణ్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని సరస్వతి మండల మహిళా సమైక్య సంఘం భవనంలో మంగళవారం వీవోఏలు సమైక్య సంఘాల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులందరూ ఒక సంఘంగా ఏర్పడాలని, అలాగే వికలాంగులు, కిశోర బాలికలు వేరువేరుగా సంఘాలు ఏర్పాటుకు బ్యాంక్ ద్వారా రుణాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీలు వందేమాతరం, సూర్యకాంత్, పోశెట్టి, గోదావరి, స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా యోగాసన అసోసియేషన్ కార్యవర్గం

భైంసా, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని సంస్కార్ స్కూల్‌లో మంగళవారం జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఒలంపిక్ స్పోర్ట్స్ అసోయేషన్ జిల్లా కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీస్ ప్రతినిధి శ్రీరాముల సాయికృష్ణ, తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ ప్రతినిధి సీహెచ్ గంగాధర్‌లు పరిశీలకులుగా నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఇందులో అధ్యక్షులుగా కదం మోహన్‌రావ్ పాటిల్, ఉపాధ్యక్షులుగా రాటి పోతన్న, కదం పర్వాజీ ప్రకాష్ పాటిల్, కార్యదర్శిగా ఉప్పు రవి, కోశాధికారిగా మిట్టపల్లి సాయినాథ్, సంయుక్త కార్యదర్శులుగా దేవుకే విలాస్, డి.అనిల్, కె.సుధాకర్, ఎన్నికయ్యారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ

తాంసి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాకాలం అయినందున వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలుగా విద్యార్థిని విద్యార్థులకు నులుపురుగులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు వీటిని అందజేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాఠశాలకు చేరుకొని ముందుగా విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వ్యాధుల విషయంపై అవగాహన కల్పించారు. మాత్రలు ఎలా వాడాలో విద్యార్థులకు వివరించారు.

అటల్ ఆలోచనాత్మక మెగా దినోత్సవం

ఖానాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అటల్ ఆలోచనాత్మక మెగా దినోత్సవంతో విద్యార్థుల్లో మరింత సృజనాత్మకత పెంపొందుతుందని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రావు అన్నారు. మంగళవారం పాఠశాలలో అటల్ ఆలోచనాత్మక మెగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు తొంటి శంకర్, బి. రవి కుమార్, సయ్యద్ ఫరాజ్, తదితరులున్నారు. .

చదువుకుందాం రండి - చదువు నేర్పిద్దాం పదండి

లక్ష్మణచాంద రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చదువుకుందాం రండి చదువు నేర్పిద్దాం పదండి అనే నినాదం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వన భారత్ సాక్షారత కార్యక్రమం అయిన ఉల్లాస్ లక్ష్యం అని ఎమ్మార్పీలు దాసరి శంకర్, పోతుగంటి గంగాధర్‌లు మంగళవారం అన్నారు. మండలంలోని వడ్యాల్‌లో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మండల విద్యాధికారి ఆర్. అశోక్ వర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసుకున్న సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాల విద్యా అవకాశం పొందని 15 సంవత్సరాలు, ఆ పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, కీలకమైన జీవన నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాలు, నిరంతర విద్యా దీని లక్ష్యమన్నారు. గ్రామ పంచాయతీలలోని నిరక్షరాస్యులు, బడి మానేసిన వారు, కనీస అవగాహనతో చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం వంటి సామర్థ్యాలను సాధించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు దాసరి శంకర్, పోతుగంటి గంగాధర్, సీఆర్పీ సుధాకర్, మండల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.

ఉల్లాస్‌పై శిక్షణ

ముథోల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు ఉల్లాస్ అనే కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. నవ భారత సాక్షరత్ కార్య



మాట్లాడుతున్న ఎంఈవో

క్రమం (ఉల్లాస్) అనేది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక కొత్త విద్యా కార్యక్రమం. దీని లక్ష్యం వయోజన విద్యను ప్రోత్సహించడం నిరక్షరాస్యతను నిర్మూలించడం ఉద్దేశ్యమని మండల విద్యాధికారి రమణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం కింద స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలకు ప్రాథమిక అక్షరాస్యత, జీవన నైపుణ్యాలు, సమాంతర విద్యను బోధిస్తారని తెలిపారు. గ్రామంలోని నిరక్షరాస్యులైన 15 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు వారిని గుర్తించి పది మందికి ఒక గ్రూపుగా ఏర్పాటు చేస్తారన్నారు. నిరక్షరాస్యులందరికీ విద్య అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి 3, 5 తరగతులు, ఆ పైన చదువుకున్న వారికి ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్‌లో ప్రవేశాలు కల్పించేలా ప్రోత్సహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు దేవేందర్, శ్రీనివాస్‌లు ఉల్లాస్ కార్యక్రమంపై హాజరైన వీవోఏలకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గురుచరణ్, సీసీలు సూర్యకాంత్, వందేమాతరం, గోదావరి, వీవోఏలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించే ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి మహిళల్లో విద్యాదీపకాంతులు వెలిగించాలని మండల విద్యాధికారి కే. శంకర్ అన్నారు. మంగళవారం దిలావర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు, ఐకేపీ వీవోఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.మోహన్‌రెడ్డి, ఆర్.కిషోర్ రిసో ర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.సదానందం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫటాఫట్

మందుల పిచికారిలో జాగ్రత్తలు పాటించాలి

: గణేష్, వ్యవసాయ అధికారి, భైంసా మండలం



పంటలను ఆశించిన వివిధ రకాల తెగుళ్ల నివారణ ప్రక్రియలో భాగంగా రసాయన మందుల పిచికారి చేసే సమయంలో రైతన్నలు జాగ్రత్త చర్యలు విధిగా పాటించాలని భైంసా మండల వ్యవసాయాధికారి గణేష్ సూచించారు. అజాగ్రత్తతో వ్యవహరిస్తే అనర్థాలు తప్పవని పేర్కొన్నారు. పిచికారి సమయంలో పాటించాల్సిన విధానాలను వివరించారు.

ప్రశ్న: రైతులు పంటలపై పురుగుల మందు పిచికారి చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

జవాబు: గాలికి ఎదురుగా పిచికారి చేయవద్దు. చేతులకు గ్లౌజులు, ముఖానికి రుమాలు కట్టుకొని పిచికారి చేయాలి.పిచికారి ప్రదేశంలో పిల్లలు, పెంపుడు జంతువులు లేకుండా చూసుకోవాలి

ప్ర: రసాయన మందులు చర్మంపై పడితే ఏమి చేయాలి.?.

జ: పిచికారి ప్రక్రియలో రసాయన మందులు చర్మంపై పడితే వెంటనే సబ్బు, నీటితో శుభ్రంగా కడుగుకోవాలి. కళ్లలో పడితే వెంటనే శుభ్రమైన నీటితో కళ్లను కడుగుకోవాలి. సత్వరమే సమీప ఆసుపత్రులకు తరలివెళ్లి అవసరమైన చికిత్సలు పొందాలి

ప్ర: రైతులు పురుగుల మందు పిచికారి చేసే విధానం తెలపండి?

జ: డబ్బాలో సగం వరకు నీరు పోసి ఆ తరువాత మందు పోసి మిగతా నీళ్ళు కలుపుకోవాలి. ఇలా చేయడం ద్వారా మందు నీటిలో సమతూల్యంగా కరుగుతుంది.పిచికారి చేసేటపుడు నీటి వనరులు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలి

ప్ర: పురుగుల మందు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

జ: దుకాణాల్లో మందులు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యమైన పురుగుల మందులను కొనాలి. కొనుగోళ్లకు సంబంధించి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. అవసరమైన పక్షంలో వ్యవసాయాధికారుల సూచనలు,సలహాలు తీసుకోవాలి.

- భైంసా, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)

జీతాలివ్వండి సారూ..

● నాలుగు నెలలుగా ఎదురుచూపులు ● ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సేవలు ● నెలనెలా జీతాలు అందక ఇక్కట్లు ● నిర్మల్ జిల్లాలో వొకేషనల్ కాంట్రాక్ట్ అధ్యాపకుల గోడు



ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ముథోల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వృత్తి విద్య కోర్స్ అధ్యాపకులకు నెలనెలా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు. చాలీచాలని వేతనాలకు పని చేస్తూ కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తూ విద్యార్థులకు రెగ్యులర్‌గా పాఠాలు బోధిస్తున్నా.. వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వొకేషనల్ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్, మే, జూన్, జూలై.. నాలుగు నెలల నుంచి వేతనం అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

నిర్మల్ జిల్లాలోని ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురు అధ్యాపకులు, ఖానాపూర్‌లో ఇద్దరు, దిలావర్‌పూర్‌లో ఒక్కరు, నిర్మల్ బాలికల కళాశాలలో ఐదుగురు ఒకేషనల్ కాంట్రాక్ట్ అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే తమకు నెల నెల వేతనం అందకపోవడంతో ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, తదితర వాటికి తీవ్ర ఇబ్బంది ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ అధ్యాపకుల ప్రకారం తాము కూడా విధులు సక్రమంగా నిర్వహిస్తున్నప్పటికీ చాలీచాలని వేతనంతో పని చేస్తున్న ఇచ్చే వేతనం సైతం నెలకి అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. ప్రభుత్వం ఆలోచించి తమను రెగ్యులర్‌గా చేస్తూ వేతనాలను సక్రమంగా అందించాలని కోరుతున్నారు. సుమారు ఒక్కొక్కరూ 15 నుంచి 20ఏళ్ల నుంచి చాలీచాలని వేతనానికి ఒప్పంద అధ్యాపకులుగా పని చేస్తున్నామని అంటున్నారు. ఇకనైన ప్రభుత్వం ఆలోచించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేసి ఒప్పంద ఒకేషనల్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రెగ్యులర్ చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఫోన్ ద్వారా డీఐఈవో పరశురాంకు వివరణ కోరగా.. జిల్లాలోని మొత్తం 11 మంది ఒప్పంద వృత్తి విద్య కోర్సు అధ్యాపకులకు సంబంధించిన ఏప్రిల్, మే నెలల వేతనం ఎస్‌టీవో కార్యాలయంకు పంపించాం. కానీ ఎస్‌టీవో అధికారులు కంట్యూనేషన్ ఆర్డర్ కావాలంటూ నిలిపి వేవారు. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించాను. అలాగే మిగతా రెండు నెలలకు సంబంధించిన వేతనాలు రావాలి. వచ్చిన వెంటనే అందజేస్తామని తెలిపారు.



కదిలిలోని శ్రీనంది అడుగు దేవాలయం



నంది అడుగుకు పూజలు చేస్తున్న మహిళలు(ఫైల్)

నంది అడుగు.. భక్తులకు గొడుగు

● నేడు నంది పాదం ఆలయ వార్షికోత్సవం



స్వయంభుగా వెలసిన నంది అడుగు

దిలావర్‌పూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిలి శివారు లో స్వయంభుగా వెలసిన నంది అడుగు దేవాలయం బుధవారం ప్రథ మ వార్షికోత్సవం జరుపుకోనుంది. బండరాయిపై నందీశ్వరుడి పాద ముద్రను దర్శించుకున్న భక్తులకు శివానుగ్రహం లభిస్తుందని చెబుతా రు. ప్రధాన ఆలయంలో నంది అడుగుతో పాటు గణపతి, శివుడు, మంగ ళగౌరీ దేవి మూర్తులు కొలువై ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో మహా గణపతి, సుబ్రమణ్యేశ్వర స్వామి, భక్తాంజనేయ స్వామిలు భక్తులకు దర్శనమిస్తారు. ఇక్కడ ఉన్న నవగ్రహాలను భక్తితో పూజిస్తే సకల దోషాల నుంచి విముక్తులవుతారని భక్తుల విశ్వాసం. కాగా కదిలి పాపహరేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు తప్పనిసరిగా తిరుగు ప్రయాణంలో ఈ ఆలయాన్ని సందర్శించి నంది అడుగుకు పూజలు చేసి వెళ్తుంటారు.

● నేడు జరిగే పూజా కార్యక్రమాలు

శ్రీనంది అడుగు ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు కొరిపెల్లి అర్జున్ రెడ్డి తెలిపారు. ఉదయం 8గంటల నుంచి ప్రారంభమయ్యే వార్షికోత్సవంలో మొదలు శ్రీగణపతి మంగళ గౌరీ ఆరాధన, రుద్రాభిషేకం, శ్రీచక్ర కుంకుమార్చన, శ్రీసుబ్రహ్మణ్య స్వామి, శ్రీభక్తాంజనేయ స్వామివారలకు అభిషేక పూజలు, తదుపరి మూల మంత్ర హవనం, రుద్ర హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి, అనంతరం సత్యనారాయణ స్వామి వ్రత పూజలు, తదుపరి భక్తులకు తీర్థ అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా త్రివర్ణ పతాక ర్యాలీ

ఇచ్చోడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా జెండా పేరుతో బీజేపీ నాయకులు ఇచ్చోడ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నపుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పహల్గాం దాడి తర్వాత చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌తో ప్రత్యర్థి స్థావరాలను మట్టుబెట్టిన సమయంలో దేశ ప్రజల్లో ఏర్పడిన ఐక్యత భావం అభినందనీయమన్నారు. ఇందులో మండల అధ్యక్షుడు తహరే రమేష్, నాయకులు నారాయణ, భీంరెడ్డి, చంద్రశేఖర్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

'వేతనాలు చెల్లించాలి'

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రిమ్స్ ఐహెచ్ఎఫ్ఎంఎస్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐలను అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. ఐహెచ్ఎఫ్ఎంఎస్ కాంట్రాక్టర్ విషయంలో నెలకొన్న తీవ్ర గందరగోళానికి కార్మికులు అయోమయానికి గురవుతున్నారని పలు సమస్యలపై మాట్లాడారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన బాట పట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రిమ్స్ యూనియన్ నాయకులు రేసు సురేందర్, పండుగ పొచ్చన్న, దశాంత్, రమేష్, రమాకాంత్, అరుణ్ సంతోష్ పాల్గొన్నారు.



ఖానాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో సంచరిస్తూ ప్రయాణికులకు ఇబ్బందులకు గురిచేస్తున్న పశువులు

ప్రయాణ ప్రాంగణంలో పశువుల సంచారం

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
● బస్సుల కింద పడి ప్రాణాలు కోల్పోతున్న జీవాలు
● పట్టించుకోని అధికారులు, యజమానులు

ఖానాపూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమని బస్సుల కోసం బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు.. ఆ బస్టాండ్‌లో పశువుల సంచారం ఇబ్బందికరంగా మారింది. ఖానాపూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పశువులు తిష్ట వేయడమే కాకుండా వచ్చిపోయే ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. బస్టాండ్‌లో సంచరించడమే కాకుండా ఒకదానితో ఒకటి పోట్లాడుతూ పరుగులు తీయడం.. అటుగా వచ్చిన వారిపై దాడులు చేయడం లాంటివి చేస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. కాగా, ఇటీవల బస్టాండ్‌లో జరిగిన ప్రమాదంలో లేగదూడ ఆర్టీసీ బస్సు కింద పడి చనిపోవడం స్థానికంగా పలువురిని కలచి వేసింది. ఈ ఘటనతో ఖానాపూర్ ప్రాంతంలోని బజరంగ్ దళ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను గోశాలలకు తరలించాలని మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. అయినా అటు అధికారులు గానీ, ఇటు పశువుల యజమానుల గాని స్పందించకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపటితో ముగియనున్న పదవీకాలం

● సహకార సంఘాల్లో ఉత్కంఠ ● మరోమారు గడువు పొడగింపుపై పాలక వర్గం ఆశలు ● ప్రభుత్వ నిర్ణయం కోసం తప్పని ఎదురుచూపులు ● నిర్మల్ జిల్లాలో 17 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు

భైంసా, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం మరో రోజు వ్యవధిలో ముగియనుంది. పదవీకాలం ముగియనుండటంతో పాలక వర్గాల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నిజానికి ఫిబ్రవరి మాసంలోనే పాలక వర్గాల ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగిసింది. కాగా ప్రభుత్వం పదవీ కాలం ముగింపు రోజు పాలక వర్గాల పదవీకాలాన్ని ఆరు నెలల పాటు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పొడగించిన పదవీ కాలం గురువారం ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పదవీకాలాన్ని మరోమారు పొడగిస్తుందా లేక ప్రత్యేకాధికారులను నియమించి వారికి బాధ్యతలను అప్పచెబుతుందా అనే సందేహంతో పాలక వర్గాలు కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం సంబంధిత విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం, సంకేతాలు వెలువరించకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.



కుభీర్ ప్రాథమిక సహకార సంఘ భవనం

జిల్లాలో 17 సహకార సంఘాలు

నిర్మల్ జిల్లాలో 19 మండలాలు ఉండగా 16 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఒక ఎఫ్ఎస్‌సీఎస్ సంఘం కలిపి మొత్తం 17 సంఘాలున్నాయి. భైంసా డివిజన్ పరిధిలో బిద్రెల్లి, హంగిర్గా, మిర్జాపూర్, కుబీర్, లోకేశ్వరం, కుంటాల ప్రాథమిక సహకార సంఘాలున్నాయి. నిర్మల్ డివిజన్ పరిధిలో బన్సపెల్లి, మంజూలాపూర్, ముజాపూర్, ఆలూర్, కౌట్ల(బి), లక్ష్మణ్‌చాంద, మామడ, పొండ్చాపూర్, ఖానాపూర్, సత్తెనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా నిర్మల్ ఎఫ్ఎస్‌సీఎస్ కేంద్రం ఉంది. ఇందులో బిద్రెల్లి పీఏసీఎల్ ముథోల్ కేంద్రంగా, హింగిర్గా పీఏసీఎస్ తానూర్ కేంద్రంగా, మిర్జాపూర్ పీఏసీఎస్ భైంసా కేంద్రంగా, బన్సపెల్లి పీఏసీఎస్ దిలావర్‌పూర్ కేంద్రంగా, పొండ్చాపూర్ పీఏసీఎస్ కడెం కేంద్రంగా పనిచేస్తున్నాయి.

ఆశల పల్లకిలో పాలక వర్గాలు

మరో రోజు వ్యవధిలో పీఏసీఎస్ సంఘాల పాలక వర్గాల పదవీ కాలం ముగియనుంది. 2019 ఫిబ్రవరి మాసంలో పీఏసీఎస్ సంఘాల ఎన్నికలు జరిగాయి. అదే మాసం 14న పాలక వర్గాలు పదవీ బాధ్యతలు చేపట్టాయి. ఐదేళ్ల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ఈయేడు ఫిబ్రవరి 14న పాలక వర్గాల పదవీకాలం గడువు ముగిసింది. అయితే ప్రభుత్వం ఎన్నికల నిర్వాహణకు సంసిద్ధం అవ్వని కారణంగా ఆరు నెలల పదవీ కాలం ఆగస్టు 14 వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పొడగించిన పదవీకాలం మరో రోజు వ్యవధిలో ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయంలో సందిగ్ధత నెలకొంది.

ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది

: పాపయ్య, డీసీవో, నిర్మల్ జిల్లా

పీఏసీఎస్ పాలక వర్గాల పదవీకాలం గడువు ముగుస్తున్న నేపథ్యంలో తదుపరి చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంది. గడువు పెంపు, ఎన్నికల నిర్వాహణ, ప్రత్యేకాధికారుల నియమాకం తదితర అంశాలన్నింటిపై ప్రభుత్వం నిర్ణయం చేపడుతుంది. ఇప్పటి వరకు సంబంధిత విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు, ఉత్తర్వులు రాలేదు.



కుంటాల పీఏసీఎస్‌లో సమీక్ష జరుపుతున్న చైర్మెన్ సట్ల గజ్జారామ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్,సీఈవో నాగభూషణ్



నేరడిగొండలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కేసీఆర్ పాలనలో పచ్చగా పల్లెలు

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పాలనలో పల్లెలు పచ్చగా మారాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలలో వన మహోత్సవంలో భాగంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పచ్చగా మారిన పల్లెలు.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మారుతున్నాయని అన్నారు. ప్రజలు పల్లెలలో దోమల బెడదతో మలేరియా, చికెన్ గున్యా, విష జ్వరతో మంచానికి పరిమితం అవుతున్నారని, గత కేసీఆర్ హయాంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు ఉండేవి గ్రామలు పచ్చదనం పరిశుభ్రతతో కళకళలాడేవన్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితి ఎక్కడ చూసినా విష జ్వరాలు, ఎండిపోయిన పల్లె ప్రకృతి వనరులు, మురుగున పడ్డ గ్రామపంచాయతీ పాలనలే ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరీం, ఎంపీడీవో శేఖర్, ఏపీవో వసంత్‌రావు, పీజీ హెడ్ మాస్టర్ పద్మా, ఎంపీవో లక్ష్మణ్, మండల కన్వీనర్ అల్లూరి శివరెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, అనిల్ అన్న యువ సైన్యం అధ్యక్షుడ దేవేందర్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆదుముల భూషణ్, ప్రతాప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనలతో ఇబ్బందులు

● ఉట్నూర్‌లో మండలంలో పలుచోట్ల ప్రమాదకరంగా మారిన వంతెనలు ● అధికారులు చొరవ చూపాలంటున్న స్థానికులు



ప్రమాదకరంగా ఉన్న నాగపూర్ వంతెన పైనుంచి వెళ్తున్న బస్సు

ఉట్నూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు భవనాల శాఖ వంతెనలు ప్రమాదకరంగా మారడంతో ప్రమాదాలకు నెలవులుగా మారాయి. ఉట్నూర్ మండల కేంద్రం నుంచి గుడిహత్నూర్ వరకు ఉన్న 35 కిలోమీటర్ల విడదిలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వంతెనల పరిస్థితి అగమ్య గోచరంగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు మార్గం గుండా ప్రతినిత్యం వందలాది బస్సులు, వందలాది లారీలు, వందలాది కార్‌లు జీపులతో పాటు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్డు గుండా కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ఖమ్మం తదితర ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు కూడా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉట్నూర్ మండలంలోని గుడిహత్నూర్ వైపు నాగపూర్ వంతెన, షాంపూర్ వంతెన, పులిమడుగు వంతెనలు, మంచిర్యాల వైపు కొత్తగూడ చెక్ పోస్ట్, గోండు కొత్తగూడ, కోలాంగుడ, మారుతి గు డా, దంతనపల్లి, ఉడుంపూర్ సమీపంలో ఉన్న వంతెనలు ప్రమాదకరంగా ఉన్నాయి. నాగపూర్ వంతెన, షాంపూర్ వంతెనల వద్ద ఉన్న అడ్డుగోడలు, ఖనిబండలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం వేసవి కాలంలో నాగపూర్ వాగులో కనిబండలు లేకపోవడంతో నాగ్‌పూర్ వెళ్తున్న లారీ ప్రమాదుంతో వాగులో పడింది. ఆ సమయంలో నీరు లేకపోవడంతో డ్రైవర్ క్లీనర్‌లు ప్రాణాలతో బయటపడ్డారు. షాంపూర్ వాగులో గత వారం ఎదురుగా వచ్చిన వాహనంతో ఎడ్లు బెదిరిపోయి వాగులో పడడంతో రైతు ప్రాణాపాయం నుంచి బయటపడగా.. పశువులకు గాయాలయ్యాయి.



ప్రమాదకరంగా ఉన్న షాంపూర్ వంతెన పైనుంచి వెళ్తున్న వాహనాలు



నాగపూర్ వంతెనపై అడ్డు(ఖని) బండలు లేని దృశ్యం

ఇరుకు వంతెనెలతో ఇబ్బందులు

ఉట్నూర్ గుడిహత్నూర్ మధ్య ఉన్న వంతెనలు ఇ రుకుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. షాంపూర్ వాగు వద్ద ఇప్పటివరకు 10 ప్రమాదాలు చోటు చేసుకోగా ఐదుగురు వరకు మృతి చెందారు. ఏందా సమీపంలో వంతెన వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పులిమడుగు ఇరుకు వంతెన వద్ద ఎదురుగా వచ్చిన వాహనాలు చూసి ఆపుకోకపోతే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్కోక్కసారి ఎదురెదురుగా వస్తున్న వాహనాల డ్రైవర్లు వంతెనలోకి రావడంతో ఇరువురు డ్రైవర్లు మాటమాట పెరిగి మీరు వెనక్కి వెళ్లాలంటే, మీరు వెనక్కి వెళ్లాలని మారం చేస్తూ వాహనాలు వంతెనపై నిలిపి వేయడంతో అప్పుడప్పుడు ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

పాత పద్ధతిలోనే పది పరీక్షలు

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పాత పద్ధతిలోనే నిర్వహించనున్నట్లు విద్యాశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి మూడారపు పరమేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 80మార్కుల ప్రశ్నాపత్రం, ఇంటర్నల్‌లో 20మార్కులు ఉండేవని, ఈ రెండింటిలో వచ్చిన మార్కుల మొత్తాలను కలిపి తుది ఫలితాలు వెలువడేవని పేర్కొన్నారు. మార్చి 2026లో జరిగే పదోతరగతి పరీక్షలలో ఫలితాల్లో కూడా ఇదే విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం పాఠశాల విద్యాసంచాలకు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలు తమ విద్యార్థులకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో తప్పనిసరిగా నాలుగు ఫార్మేట్ అసైన్మెంట్ పరీక్షలు నిర్వహించి, మార్కుల జాబితాను సిద్ధం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆదేశించారు.

16న జిల్లాస్థాయి వాలీబాల్ అండర్-15 సెలక్షన్ ట్రయల్స్

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 16న పట్టణంలోని రవి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వాలీబాల్ అండర్-15 సెలక్షన్ ట్రయల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి సెలక్షన్‌కి ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు 18, 19 తేదీలలో సరూర్ నగర్ స్టేడియం రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు బీజేపీ మహాసంపర్క్ అభియాన్

దిలావర్‌పూర్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూలోలం, బన్సపల్లి, కంజర్ గ్రామాల్లో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు అయిండ్ల నర్సారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తోందని ఈ సందర్భంగా విమర్శించారు.

జిల్లాలో సీఎంఆర్ అక్రమాలు ఎల్లలు దాటిపోయాయి. అధికారుల ప్రాథమిక లెక్కల ప్రకారం రూ.120 కోట్లకు పైగా విలువైన సీఎంఆర్ బియ్యం పక్కదోవ పట్టినట్లు నిర్ధారణ అయ్యింది. గత కొద్దిరోజుల నుంచి సంబంధిత జిల్లా యంత్రాంగం 2021 నుంచి కొనసాగుతున్న సీఎంఆర్ అవినీతి అక్రమాలపై లోతుగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీశారు. అధికారుల విచారణలో కొంత మంది రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి కనికట్టు ప్రదర్శన మాదిరిగా అక్రమాలకు తెరలేపారని తేలింది.

• ముథోల్‌లోని ముద్గల్ గ్రామంలో కేసులు నమోదైన రైస్ మిల్లులు ఇదే..



రూ.కోట్ల సొమ్ము కొల్లగొట్టి..

- సీఎంఆర్‌లో భారీ గోల్‌మాల్
- 17 మిల్లులపై కేసులు
- రూ.120 కోట్ల విలువైన బియ్యం మాయం
- 2021 నుంచి కొనసాగుతున్న అక్రమాల పరంపర

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 2021 నుంచి ఇప్పటివరకు ప్రతీ ఖరీఫ్, రబీ సీజన్‌లలో సీఎంఆర్ అక్రమాలు జరిగినట్లు విచారణలో బహిర్గతమైంది. మొదట సంబంధిత శాఖ అధికారులు సీఎంఆర్ అక్రమాలపై పెద్దగా దృష్టి సారించకపోవడం రైస్‌మిల్లుల యాజమాన్యాలకు వరంగా మారింది. కొంతమంది రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి సంబంధిత శాఖ లోసుగులు, అవసరాన్ని ఆసరాగా చేసుకొని సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండానే పక్కదోవ పట్టించారన్న పిర్యాదులు వచ్చాయి. అప్పట్లోనే సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులు ఈ ధాన్యం అక్రమాలపై చర్యలు తీసుకోకపోవడం రైస్‌మిల్లు యజమానులకు వరమైంది. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న రైస్‌మిల్లు యజమానులు ప్రతీ సీజన్‌లో ఇదే తరహా అవకతవకలకు పాల్పడి రూ.కోట్ల సొమ్మును కొల్లగొట్టారన్న ఆరోపణలున్నాయి. అధికారుల విచారణలో అక్రమాలు రుజువుకావడంతో 17 రైస్‌మిల్లులపై అధికారులు కేసులు నమోదు చేయడం చర్చనీయాంశమవుతోంది.

మిల్లర్ల వద్దే ఇంకా 40వేల నిల్వలు

2021 రబీ నుంచి 2024 - 2025 వరకు మొత్తం 1,12,358 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అలాట్ చేయగా మిల్లు యజమానులు 35,049 ఎంటీఎస్‌ల బియ్యాన్ని సర్కారుకు అప్పగించారు. వాస్తవానికి మిల్లర్లు 75,379 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌర సరఫరాల శాఖకు అప్పగించాల్సి ఉంది. అయితే ఇంకా 40,330 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి. అయితే ఈ బియ్యం అప్పగించాలంటూ అధికారులు పలువురు రైస్‌మిల్లర్లకు చాలాసార్లు నోటీసులు జారీ చేయడమే కాకుండా గడువును సైతం విధించారు. హెచ్చరికలను బేఖాతరు చేస్తూ య ధావిధిగా సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదోవ పట్టించడం, సర్కారుకు అందించాల్సిన బియ్యాన్ని అందించకుండా మొండిగా వ్యహరించడం పరిపాటిగా మారింది. దీం తో 17 రైస్ మిల్లులపై అధికారులు ఎట్టకేలకు కేసులు నమోదు చేశారు.

బినామీల దందా..

కొంతమంది రైస్‌మిల్లర్లు తమకున్న రాజకీయ పలుకుబడి పరపతితో బినామీల పేరిట రైస్‌మిల్లులను ఏర్పాటుచేసి సీఎంఆర్ ధాన్యానికి కన్నం వేశారంటున్నారు. ఇందులో కేసులు నమోదైన రైస్‌మిల్లు యజమానులే సూత్రధారులుగా ఉన్నారన్న విమర్శలున్నాయి. తమ రైస్‌మిల్లులపై కేసులు నమోదు కాగానే వీరు మరో బినామీ రైస్‌మిల్లును ఏర్పాటుచేసి ఆ రైస్‌మిల్లుకు సీఎంఆర్ కేటాయింపులు చేసుకొని మళ్లీ ఈ మిల్లు ద్వారా కూడా అవకతవకలకు పాల్పడినట్లు పిర్యాదులున్నాయి. రూ.కోట్లలో జరిగిన ఈ అక్రమ వ్యవహారం వెనక అప్పటి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు వెన్నుదన్నుగా నిలిచారాన్న ఆరోపణలున్నాయి. అప్పటి ప్రజాప్రతినిధుల అండదండలతోనే జిల్లాలోని ఓ ప్రాంతంలో దాదాపు 10కి పైగా బినామీ రైస్‌మిల్లులు ఏర్పాటుచేసి అక్రమాలను కొనసాగించారంటున్నారు. అయితే ప్రస్తుతం జరిగిం ది ప్రాథమిక విచారణనే అంటున్నారు. అధికారులు సీఎంఆర్ అక్రమాలపై సీఐడీ చేత లోతుగా విచారణ జరిపితే అసలు వాస్తవాలు పూర్తిస్థాయిలో వెలుగుచూస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

17 మిల్లులపై కేసులు

జిల్లాలోని 17 రైస్‌మిల్లులు ఇప్పటివరకు కేటాయింపులకు అనుగుణంగా సీఎంఆర్ బియ్యాన్ని సర్కారుకు అప్పగించకపోవడం, సర్కారు సైతం గడువును విధించిన గడువులను బేఖాతరు చేయడంతో ఎట్టకేలకు ఆ మిల్లులపై సర్కారు కొరడా ఝులిపించింది. మొత్తం 17 మిల్లులపై నిబంధనల ప్రకారం కేసులు నమోదుచేసి ఆ రైస్‌మిల్లులను సీజ్‌చేశారు. లోకేశ్వరం మండలంలోని ధర్మోరాలో గల వేంకటేశ్వర రైస్ మిల్, జోహర్‌పూర్‌లోని రాజేశ్వర రైస్‌మిల్, సారంగాపూర్ మండలం బీరవెల్లిలో గల కృపారైస్‌మిల్, చించోలిలోని అన్నపూర్ణ అగ్రో ఇండస్ట్రీస్, భైంసా మండలంలోని దహెగాంలో గల వేంకటలక్ష్మి నర్సింహ రైస్‌మిల్, ముథోల్ మండలం చింతకుంటలోని జశ్రిత రైస్ ఇండస్ట్రీస్, కుంటాల మండలం కల్లూర్‌లోని ద్వారకమాయి అగ్రో ఇండస్ట్రీస్, మాటేగాంలోని వేంకటేశ్వర అగ్రో రైస్‌మిల్, బాసరలోని వరలక్ష్మి రైస్‌మిల్, కిర్గుల్ బిలోని అన్నపూర్ణ రైస్‌మిల్, కొండాపూర్ సర స్వతీ పారా బాయిల్డ్ రైస్‌మిల్, తిరుపెల్లిలోని ప్రతిమా అగ్రో ఇండస్ట్రీస్, దేగాంలోని రాజరాజేశ్వర రైస్‌మిల్‌లతో పాటు రాఘవేంద్ర రైస్‌మిల్, నిర్వాణ రైస్‌మిల్, ఆసియన్ రైస్‌మిల్, గణపతి రైస్‌మిల్‌లపై అధికారులు కే సులు నమోదుచేసి ఆ మిల్లులను సీజ్‌చేశారు. వీరిపై సీఎంఆర్ ధాన్యం రికవరీ కోసం మరిన్నిచర్యలు తీసుకునేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

72 గంటల్లో భారీ వర్ష సూచన

- అత్యవసరం అయితేనే ఇళ్ల నుంచి బయటకు రావాలి
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి: కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రానున్న 72 గంటల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. భారీవర్ష సూచన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి వస్తే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో నిరంతరం అందుబాటులో ఉండి సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను తప్పక పాటించాలని, కాజ్‌వేలపై ప్రయాణం నిషేధించాలని, చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోతే స్పందించాలని, శిథిల భవనాల్లో నివసించే వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. నదులు, వాగుల వద్దకు ఎవరూ వెళ్లకుండా చూడాలని, నీటి కలుషితంతో వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య శాఖ ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ శాఖ అధికారులు తమ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి ప్రజలకు టామ్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. కలెక్టరేట్‌లో 24/7 గంటలు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో 9100577132 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ప్రజలను కోరారు. సమావేశంలో ఎస్పీ జానకీ షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్‌కుమార్, ఆర్డీవోరత్న కళ్యాణి, అధికారులున్నారు.

స.హ.చట్టం దరఖాస్తులను పరిష్కరించాలి

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటన నేపథ్యంలో శాఖల వారీగా నమోదైన దరఖాస్తులు, వాటి పరిష్కారం, పెండింగ్ కేసులు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో సమాచార హక్కుచట్టం దరఖాస్తులపై కమిషన్ బృందం విచారణ చేపడుతుందని వెల్లడించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు తానూర్ విద్యార్థి

తానూర్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని వివేకానంద పాఠశాల విద్యార్థి టి.పార్థు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విశాంత్ తెలిపారు. తెలంగాణ యోగాసన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భైంసాలోని గౌతమి పాఠశాలలో నిర్వహించిన 6వ జిల్లాస్థాయి యోగా పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, సెప్టెంబర్‌లో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనన్నట్లు తెలిపారు. ఈ విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ నర్సింగ్‌రావు, యోగటీచర్ మల్లేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

సాయిబాబా ఆలయ ప్రాంగణంలో వన మహోత్సవం

నిర్మల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయ ప్రాంగణంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయిదీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి తన సొంత ఖర్చులతో ఆంధ్రాప్రాంతం నుంచి రాగి, మర్రి, జువ్వి మొక్కలను తెప్పించారు. ఈ మొక్కలకు నిర్మల్‌కు చెందిన ప్రముఖ వేద పండితులు గురుమంచి చంద్రశేఖర్ శర్మ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆలయ ఆవరణలో నాటారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సాయిదీక్ష సేవా సమితి సభ్యులు జైపాల్‌రెడ్డి, నందు ఉన్నారు.

హమాలీ, చాట, దడువాయి చార్జీలు పెంచాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్

నిర్మల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): హమాలీ చాట, దడువాయి చార్జీలు వెంటనే పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం అడిషనల్ డైరెక్టర్, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ భైంసా హమాలీ కార్మికులు, హమాలీ చార్జీలు, చాట చార్జీలు, దడువాయి చార్జీలు పెంచాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎన్ రెడ్డి, రమేష్, ఎస్‌రే హాజీ, సందేశ్, విఠల్, రాజుబాయి, గంగాబాయి, సావిత్రిబాయి, తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను సర్వీసు నుంచి తొలగించాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ శాఖ

నిర్మల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పదోన్నతులు, ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో మాట్లాడడానికి కార్యాలయానికి వెళ్లిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిపై భౌతిక దాడికి ప్రయత్నించిన ఉమామహేశ్వర్‌రెడ్డి, కులం పేరుతో తిట్టిన జిల్లా విద్యాశాఖ అధికారి రామారావును వెంటనే సర్వీసు నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడు వెంకటరావు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కార్యవర్గ సభ్యులు మధుకర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

మత్తుతో జీవితాలకు ముప్పు: ఏఎస్పీ


భైంసా, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైట్ టీ-షర్ట్ క్లబ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నోమన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం-ఆరోగ్యానికి హానికరంపై అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. మత్తుకు బానిసలై జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని సూచించారు. సీఐ గోపినాథ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో ఆరోగ్యంపై జరిగే దుష్ప్రరిణామాలను వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు రవాణా చేసినా, సేవించినా, విక్రయాలు చేపడుతున్న సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. డయల్ 100తోపాటు టోల్ ఫ్రీ నెంబర్ 1908 కాల్ చేయాలని కోరారు. అందరూ కలిసి మాదక ద్రవ్య రహిత భైంసాను తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, కళాశాల ప్రిన్సిపాల్ శివరంజని, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాసురేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులకు నిర్వహించి వ్యాసరచన పోటీల్లోని విజేతలకు ఏఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సీఐ గోపినాథ్, ఏఎంసీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్‌పాటిల్‌లు బహుమతులు, ప్రశంస పత్రాలను అందచేశారు.



విజేతలకు ప్రశంస పత్రాలను అందచేస్తున్న ఏఎస్పీ, సీఐ, ఏఎంసీ చైర్మన్

కడెం ప్రాజెక్టు రెండు గేట్ల ఎత్తివేత

- 7, 9 గేట్లను ఐదు ఫీట్ల మేరకు ఎత్తిన అధికారులు



కడెం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్న దృశ్యం

ఖానాపూర్/కడెం, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): కడెం ప్రాజెక్టు రెండు గేట్లను అధికారులు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 4,812 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు 7, 9వ నెంబర్ గేట్లను 5ఫీట్ల మేరకు ఎత్తారు. ఈ 2గేట్లను ఎత్తడం ద్వారా దిగువకు 12,833 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ప్రాజెక్టు రెండు గేట్లను ఐదు ఫీట్ల మేరకు ఎత్తినట్లు వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 696.775 ఉన్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వసామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.915 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు

నిర్మల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనఅందరిపైనా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓటు చోరీకి వ్యతిరేకంగా రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంగళవారం జిల్లాకేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో కాంగ్రెస్ నాయకులు వీక్షించారు. కేంద్రఎన్నికల సంఘం (ఈసీ)పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న 'ఓటుచోరీ' ఆరోపణలకు సంబంధించి దేశవ్యాప్త ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా వెబ్‌పేజీని పార్టీ ప్రారంభించిందని దానిలో తమపేర్లను నమోదు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటు చోరీపై కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందులో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, పీసీసీ సభ్యులు సాధ సుదర్శన్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రమణారెడ్డి

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి

మామడరూరల్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని మండల విద్యాధికారి రమణారెడ్డి అన్నారు. మంగళవారం ఉన్నత పాఠశాల మామడ మండల కేంద్రంలో నవసాక్షరత్ భారత్ వారి ఆధ్వర్యంలో 'ఉల్లాస్' గురించి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 100 రోజుల్లో గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను గురించి అక్షరాస్యులుగా మార్చడానికి గ్రామస్థాయిలో స్వచ్ఛంద వాలంటీర్ల ద్వారా వారికి అనుకూల సమయంలో శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడు, గ్రామ కేపీ వీవోలు పాల్గొన్నారు.

బాబాపూర్ హైస్కూల్‌లో బాలశక్తి శిబిరం

లక్ష్మణచాంద రూరల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలశక్తి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్హానా బేగం మాట్లాడుతూ నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ రూపొందించిన కార్యక్రమం బాలలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, క్షేత్ర పర్యటన అనుభవాలు, నైపుణ్యాభివృద్ధి, సాధికారత అంశాలలో అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి ఒక హెల్త్‌ప్రొఫైల్ తయారు చేయ డం ద్వారా విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను కల్పించడం బాలశక్తి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పాలేపు నగేష్, ఫార్మసిస్ట్ ప్రశాంతి, ఆరోగ్య సిబ్బంది కృష్ణవేణి పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



రోడ్డు వెడల్పు చేయాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా: ఎమ్మెల్యే

ఖానాపూర్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందువరుసలో నిలుపుతానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. బీర్నంది గ్రామంలో నిర్వహించిన బాలశక్తి కార్యక్రమానికి హాజరయ్యారు. సత్తెనపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై దివ్యాంగులకు పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఖానాపూర్ పట్టణంలో గత కొద్ది రోజులుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు వెడల్పు పనులను ప్రారంభించేందుకు రోడ్డు పక్కన స్థలాలు కోల్పోతున్న వారితో ఎమ్మెల్యే మాట్లాడారు. 40 ఫీట్ల వరకు వెడల్పు చేస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, తాము ప్రభుత్వానికి సహకరిస్తామని రోడ్డు పక్కన స్థలాలు కోల్పోతున్న వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారంతా 40 ఫీట్లకు అంగీకరిస్తున్నట్లు ఒక పత్రం రాసి తనకు అందజేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సూచించారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, ఖానాపూర్, సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మన్లు ఇప్ప సత్యనారాయణ రెడ్డి, ఆమంద శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం ఉన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన యువతి

ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు రాఖీ కట్టి ఎమ్మెల్యేపై తనకున్న అభిమానాన్ని, సోదరభావాన్ని ఓ యువతి చాటుకుంది. కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ ఇటీవల శస్త్ర చికిత్స చేసుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా నిమ్మల రమేష్ కూతురు హర్ష ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు రాఖీకట్టింది.

అటవీ అధికారుల నుంచి కాపాడాలని ఎమ్మెల్యేకు తర్లపాడ్ రైతులు వినతి

తమకు పట్టాలున్నా వ్యవసాయ భూములలో తమను పనులు చేసుకోకుండా అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు పాత తర్లపాడ్ గ్రామ రైతులు విన్నవించారు. సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రం అందజేశారు. 34ఏళ్ల క్రితం ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామంలో 19మంది నిరుపేదలకు రెండు ఎకరాల చొప్పున వ్యవసాయ భూమిని ఇవ్వడంతోపాటు పట్టాలు మంజూరు చేసిందని గ్రామస్తులు తెలిపారు. భూములను సాగుచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న తమను ఇటీవల అటవీశాఖ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ భూములలో బోర్లుచ బావులను గాని తవ్వకుండా అడ్డుకుంటున్నారని రైతులు మక్కల భీమన్న, బొంత సాయన్న, నాయకులు సార్ల నర్సయ్య, రఘుపతి రెడ్డి, శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, లక్ష్మణ్ విన్నవించారు.